
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 3 మెదక్
శుక్రవారం 10 జనవరి 2025
జిల్లాల వార్తలు



రేపు ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపికలు ఈ నెల 11న సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయబాబు, జాయింట్ సెక్రటరీ మహేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు ఎస్ఎస్‌సీ మెమో, ఆధార్‌కార్డు, బోనఫైడ్‌తో ఉదయం 9 గంటల వరకు రిపోర్ట్ చేయాలని తెలిపారు. వివరాలకు 9849951217, 7780333109 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ముగిసిన పోలీస్ స్పోర్ట్స్ మీట్

● క్రీడలతో క్రమశిక్షణ, మానసిన ప్రశాంతత ● మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

మెదక్ అర్బన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా పోలీస్ స్పోర్ట్స్ మీట్ గురువారంతో ముగిసింది. ఈ క్రీడల్లో మెదక్, తూప్రాన్, ఏఆర్ జట్లు పాల్గొనగా... కబడ్డీ, వాలీబాల్, 100 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందెం, రిలే, టగ్ ఆఫ్‌వార్, డిస్కస్‌త్రో, షాట్‌పుట్, షటిల్ బ్యాడ్మింటన్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ముగింపు వేడుకల్లో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ క్రీడలతో క్రమశిక్షణతో పాటు, మానసిన ప్రశాంతత కలుగుతుందన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన జట్టు మరింత ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, మెదక్, తూప్రాన్ డీఎస్పీలు ప్రసన్నకుమార్, వెంకటరెడ్డి, ఏఆర్ డీఎస్పీ రంగనాయక్, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు. పోలీసుల పనితీరు, ప్రజల్లో ఉన్న అభిప్రాయాలను తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వ పోలీసు శాఖ రూపొందించిన క్యూఆర్ కోడ్ ఆఫ్ సిటిజన్‌ను పోస్టర్‌ను కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి ఆవిష్కరించారు.



విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

సంగారెడ్డి ఎర్ధనూరు చౌడమ్మ జాతరలో జగ్గారెడ్డి



గుట్ట మీద చౌడమ్మ తల్లిని దర్శించుకుంటున్న జగ్గారెడ్డి, చెర్యాల ఆంజనేయులు



గుట్ట మీద చౌడమ్మ తల్లిని దర్శించుకునేందుకు వస్తున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : కంది మండలంలోని ఎర్ధనూరు శివారులో ఉన్న చౌడమ్మ జాతరలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగ్గారెడ్డి పాల్గొన్నారు. గురువారం జరిగిన ఈ జాతరలో పాల్గొన్న జగ్గారెడ్డి ఆలయంలో పూజలు నిర్వహించారు. జగ్గారెడ్డికి ఆలయ పూజారులు అపూర్వ స్వాగతం పలికారు. జాతరకు వచ్చిన భక్తులతో పాటు జగ్గారెడ్డి స్టెప్పులు వేస్తూ ఉత్తేజ పరిచారు.

జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌కు
నాలుగు ప్రాజెక్టులు

రాష్ట్రస్థాయి ప్రదర్శనలో ఉత్తమంగా ఎంపిక



జాతీయ స్థాయికి ఎంపికైన ఎగ్జిబిట్లను ప్రదర్శించిన విద్యార్థులు, గైడ్‌టీచర్లు

సంగారెడ్డి అర్బన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి) : ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల్లో సంగారెడ్డి జిల్లా నుంచి నాలుగు ప్రాజెక్టులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. అలాగే, బాల వైజ్ఞానిక ప్రదర్శనలో రెండు ఎగ్జిబిట్లు దక్షిణ భారతదేశ స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయి. మహబూబ్‌నగర్‌లో ఈ నెల 7 నుంచి 9 వరకు రాష్ట్ర స్థాయిలో జరిగిన ప్రదర్శనలో అత్యుత్తమంగా నిలిచిన ఆరు ఎగ్జిబిట్లను జాతీయస్థాయికి ఎంపిక చేశారు. ఎగ్జిబిట్లను ప్రదర్శించిన విద్యార్థులు, గైడ్ టీచర్లను కలెక్టర్ క్రాంతి, అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, డీఈవో వెంకటేశ్వర్లు, డీసీఈబీ సెక్రటరీ లింబాజీ, జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి, కోఆర్డినేటర్ వెంకటరమణాచార్యులు అభినందించారు.

'ఇందిరమ్మ' సర్వే..
తప్పుల తడక

నమోదు చేసిన వివరాలకు కుదరని పొంతన

పరిశీలించనున్న అధికారులు

రెండు గ్రామాల్లో మళ్లీ సర్వే

మెదక్ జిల్లాలో 96 శాతం సర్వే పూర్తి

వలస కుటుంబాలే మిగిలాయి



సంగారెడ్డిలో ఓ దరఖాస్తుదారుడి ఇంటిని పరిశీలిస్తున్న సర్వే సిబ్బంది, ఉన్నతాధికారులు

మెదక్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో తప్పులు దొర్లినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొన్నిచోట్ల ఎన్యుమరేటర్లు నమోదుచేసిన వివరాలకు, క్షేత్రస్థాయి పరిస్థితులు భిన్నంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో, అధికారులు జిల్లాలోని రెండు మండలాల్లో సూపర్‌చెక్ చేయాలని నిర్ణయించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో దొర్లిన తప్పులను గుర్తించేందుకు ఉన్నతాధికారులు ర్యాండమ్‌గా మళ్లీ సర్వే నిర్వహిస్తున్నారు. మెదక్ జిల్లాలో నార్సింగి, హవేళీఘనపూర్ మండలాల్లో సర్వేలో తప్పులు చోటు చేసుకున్నాయనే సందేహంతో అధికారులు కొన్ని కుటుంబాలకు సంబంధించిన వివరాలను మరోసారి పోల్చి చూసుకుంటున్నారు. సర్వే సమాచారం నమోదులో ఏమైనా అక్రమాలు చోటు చేసుకున్నాయా అని పరిశీలిస్తున్నారు. సర్వేలో తప్పుడు సమాచారం నమోదయినట్లు తేలితే ప్రభుత్వం ప్రత్యేకంగా సూపర్ చెక్ కార్యాచరణ రూపొందించనుంది.. సర్వే చేసిన లబ్ధిదారుల దరఖాస్తుల్లో 5 శాతం మంది వివరాలను ఎంపీడీవోలు, మున్సిపాలిటీలలో కమిషనర్లకు నివేదిస్తారు. ఆయా దరఖాస్తు దారుల వద్దకు వెళ్ల వివరాలను మళ్లీ పరిశీలిస్తారు. అనంతరం గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు.

చివరి దశకు సర్వే

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వే ప్రస్తుతం చివరిదశకు చేరుకుంది. సర్వే ప్రక్రియను

మిగతా 6వ పేజీలో..

మృతదేహానికి
రీ పోస్ట్‌మార్టం

● ప్రైవేట్ ఆస్పత్రి నిర్లక్ష్యంతో చనిపోయిందని కుమార్తె ఫిర్యాదు
● నాలుగు నెలల అనంతరం కేసు నమోదు

5

అంసాన్‌పల్లిలో
రాతియగం ఆనవాళ్లు

● ఆది మానవుడి రాతి పనిముట్ల గుర్తింపు
● క్రీస్తు పూర్వం 5వేల సంవత్సరాల నాటివని అంచనా

5

ఓ వైపు తక్కువ..
మరోవైపు ఎక్కువ!

● ఇష్టారాజ్యంగా 65వ నంబరు జాతీయ రహదారి విస్తరణ
● ఓవైపు 85 ఫీట్లు.. మరోవైపు 115 ఫీట్లుగా హద్దుల గుర్తింపు



హైవేకు ఉత్తరం వైపు 85 ఫీట్ల వద్ద హద్దురాయి



దక్షిణం వైపు 115 ఫీట్ల వద్ద గుర్తించిన హద్దు

సంగారెడ్డి క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి విస్తరణ పనులు ఇష్టారాజ్యంగా చేస్తున్నారంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 65వ నంబరు జాతీయ రహదారిని లింగంపల్లి నుంచి సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లి వరకు ఆరు లేన్లుగా విస్తరించే పనులు కొనసాగుతున్నాయి. మొత్తం 200 ఫీట్ల వెడల్పుతో రోడ్డును విస్తరించనున్నారు. ఇందుకోసం రోడ్డు మధ్య నుంచి ఇరువైపులా 100 ఫీట్ల చొప్పున విస్తరించాల్సి ఉంది. గతంలోనే రోడ్డుకు ఇరువైపులా ఎంత దూరం భూమిని సేకరించాలనేది గుర్తించి హద్దురాళ్లు పాతారు. కానీ, పోతిరెడ్డిపల్లి చౌరస్తా నుంచి కంది శివారు రెండు కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరణ పనులు అధికారులు ఇష్టారాజ్యంగా కొనసాగిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పక్షపాతమెందుకు?

రోడ్డును 200 ఫీట్లమేర విస్తరించేందుకు 2006లోనే హద్దులను గుర్తించారు. ఈ హద్దుల్లోనే రోడ్డును విస్తరించాలని అధికారులు నిర్ణయించారు. పోతిరెడ్డిపల్లి ఫ్లైఓవర్ నుంచి కంది సమీపంలోని జమ్‌జమ్ దాబా వరకు రెండు కిలోమీటర్ల వరకు ఓవైపు 15 ఫీట్లను అదనంగా విస్తరిస్తున్నారని, మరోవైపు అంతమేర తక్కువ సేకరిస్తున్నారని భవన యజమానులు ఆరోపిస్తున్నారు. ఉత్తరం వైపు 85 ఫీట్లు, దక్షిణం వైపు 115 ఫీట్లు సేకరించారని పేర్కొన్నారు. రోడ్డు మధ్య నుంచి ఇరువైపులా సమానంగా స్థలాన్ని గుర్తించకపోవడంతో ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. దక్షిణం వైపు ఉన్న భవనాలు నేలమట్టమయ్యే పరిస్థితి ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తప్పిదం కారణంగా

మిగతా 6వ పేజీలో..



నిర్లక్ష్యం..
నిండు ప్రాణాలకు
ముప్పు

● అతివేగం.. మద్యం మత్తుతో జీవితాలు చిత్తు
● రోడ్డు భద్రతా నిబంధనలను పాటించని వాహనదారులు
● పోలీసులు పదేపదే చెబుతున్నా మారని తీరు

5

ప్రమాదాల నివారణకు
హైవే 44 దత్తత

పారిశ్రామిక అనుమతులన్నీ పారదర్శకంగా, టీఎస్ఐపాస్ ద్వారా ఇస్తున్నామంటూ గత ప్రభుత్వం గొప్పలు చెప్పుకున్నా.. అధికారులు కొర్రీలు పెడుతుండటంతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు అనుమతుల కోసం చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు. పటాన్‌చెరు పారిశ్రామికవాడలో పరిశ్రమల ఏర్పాటుకు అధికారులు అనుమతులు ఇవ్వకుండా.. ఉన్నతాధికారులతో మాట్లాడుకోండి అంటున్నారు.



పరి'శ్రమ' వృథా..!

● అనుమతుల్లో ఆలస్యం
● కొర్రీలు పెడుతున్న అధికారులు

పటాన్‌చెరు రూరల్, జనవరి 10: పటాన్‌చెరు పారిశ్రామికవాడ ఫేస్ టులో పరిశ్రమ స్థాపన కోసం 15 ఎకరాలు కొనుగోలు చేసిన ఓ పారిశ్రామికవేత్తకు టీజీఐఐసీ అధికారులు అనుమతులు ఇవ్వకుండా తిప్పించుకుంటున్నారు. పటాన్‌చెరు ఐడీఏ ఫేజ్ 2లో 833, 834, 836, 837, 838 సర్వే నంబర్లలో లక్ష్మిక్లే, సాయి ఆటోమేటిక్ బ్రిక్స్ ఏర్పాటు చేసేందుకు 25.14 ఎకరాల భూమిని 1993 జూలై 17న ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎఫ్‌సీ) నుంచి వేలం ద్వారా ఎంఎస్ లైట్ క్రియేట్ కనస్ట్రక్షన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థ కొనుగోలు చేసింది. వీరి నుండి ఎంఎస్ శ్రీనిధి ఇండస్ట్రీస్ యాజమాన్యం 2006 మే 11న 15.04 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. ఈ మేరకు ఏపీఐఐసీ సంగారెడ్డి సబ్ కలెక్టర్‌కు సదరు భూమిని రిజిస్ట్రేషన్ చేయాల్సిందిగా ఎన్‌వోసీ ఇచ్చింది. దీంతో సదరు యాజమాన్యం మ్యుటేషన్ కోసం పటాన్‌చెరు టీజీఐఐసీ కార్యాలయంలో సంప్రదించగా, దరఖాస్తు సక్రమంగా సమర్పించాలని సూచించారు. మరోసారి దరఖాస్తు చేసుకుని వెళ్లగా, ఉన్నతాధికారులతో మాట్లాడుకోవాలని సూచించి పంపించారు. ప్రధాన కార్యాలయానికి వెళ్లినా.. మళ్లీ అదే చెప్పారు.

అనుమతులు ఇవ్వకపోగా..

తమ భూమికి టీజీఐఐసీ అనుమతులకు దరఖాస్తు చేసుకున్నామని, వారి నుంచి స్పందన లేకపోవడంతో తమ భూమి చుట్టూ బేస్‌మెంట్, ఫెన్సింగ్ వేసుకుంటామని శ్రీనిధి ఇండస్ట్రీస్ యాజమాన్యం గతేడాది మే 29న హైకోర్టును ఆశ్రయించి, ప్రహరీ నిర్మించుకుంది. అయితే, గతేడాది డిసెంబర్ 11, 18 తేదీల్లో జోనల్ మేనేజర్ తన సిబ్బంది వచ్చి ప్రహరీని కూల్చివేయడంతో సంస్థ యాజమానులు కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. దీనిపై కలక్టర్ స్పందిస్తూ హైకోర్టు ఆదేశాలు ఉండగా, ఆ భూముల్లోకి ఎలా వెళ్లారని టీజీఐఐసీ

మిగతా 6వ పేజీలో..



విద్యుద్దీపాల వెలుగులో మెదక్‌లోని వేంకటేశ్వరాలయం

వైకుంఠ ద్వార దర్శనానికి
ఆలయాలు ముస్తాబు

మెదక్ అర్బన్/సంగారెడ్డి అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని మెదక్, సంగారెడ్డి జిల్లాలోని వైష్ణవాలయాలు ముస్తాబయ్యాయి. భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మెదక్ జిల్లా కేంద్రంలోని కోదండరామాలయం, వేంకటేశ్వరాలయం, కూచన్‌పల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం, సంగారెడ్డిలోని శ్రీవైకుంఠపుర ఆలయాలతోపాటు పలు ప్రముఖ ఆలయాల వద్ద వేడుకలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. శుక్రవారం తెల్లవారజామున 4 గంటల నుంచే ఉత్తరద్వార దర్శనానికి అనుమతిస్తారు. జిల్లా కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలో ప్రాతఃకాలం 3:30 గంటల నుంచి మూలవిరాట్టులకు అభిషేకాలు, విశేష పూజలు నిర్వహిస్తారు. 4 గంటలకు వైకుంఠద్వారం వద్ద పుష్ప వేదికపై ఆసీనులై స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు, నివేదనలు, సప్త హారతుల సమర్పణ, మంత్రపుష్పం, అనతంరం వేదఘోష, మహదాశీర్వచనం ఉంటుంది. ఉదయం 5 గంటలకు భక్తులకు దర్శనం కల్పిస్తారు.

ముక్కోటి దేవతలు వైకుంఠంలో శ్రీమన్నారయణుని పూజించే రోజే ముక్కోటి ఏకాదశి. వైకుంఠ ఏకాదశి, మోక్షదా ఏకాదశి అని కూడా పిలుస్తారు. జగద్రక్షణ చింతనయను యోగ నిద్రలో ఉన్న శ్రీమహావిష్ణువు మేల్కొని బ్రహ్మాది దేవతలకు దర్శనమిచ్చే రోజే ముక్కోటి ఏకాదశి అని శాస్త్రాలు చెబుతున్నాయి.



సంగారెడ్డి శివారులోని శ్రీవైకుంఠపురం దేవాలయంలో ముస్తాబైన వేంకటేశ్వరస్వామి

బావిలో పడి యువకుడి మృతి

నారాయణఖేడ్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చాప్టా.కెలో బావిలో పడి ఓ యువకుడు మృతి చెందాడని స్థానిక ఎస్ఐ శ్రీశైలం గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. చాప్టా.కె గ్రామానికి చెందిన మేత్రి ఉమాకాంత్(29)కు కొన్నేళ్లుగా మతిస్థిమితం సక్రమంగా లేక గ్రామంలో రోడ్లపై తిరిగేవాడు. గ్రామ సమీపంలోని బావిలో అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించారు. ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడ్డాడా లేక, తనంతట తాను బావిలో దూకాడా అన్న విషయం తెలియలేదు. ఇందుకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

రామచంద్రాపురం టౌన్ జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్ఐ శశికాంత్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామచంద్రాపురం డివిజన్ పరిధి కానుకుంట షాబాద్ హోటల్ ఎదురుగా సుమారు 55 ఏళ్ల వయసు ఉండే గుర్తు తెలియని వ్యక్తి పడి ఉండగా, స్థానికులు 108కి సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ నిర్వాహకులు పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు చెప్పారు. కానుకుంటలో హనుమాన్ ఆలయం వద్ద భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగించేవాడని, ఆకలికి అలమటించి చనిపోయాడని పోలీసులు చెప్పారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అంతర్రాష్ట్ర స్మగ్లర్‌కు రిమాండ్

జహీరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గోవా మద్యాన్ని వివిధ రాష్ట్రాలకు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న అంతర్‌రాష్ట్ర స్మగ్లర్ ఆరీఫ్‌ఖాన్‌ను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ రమేష్ తెలిపారు. వారి కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్‌లోని ధార్‌జిల్లాకు చెందిన ఆరీఫ్‌ఖాన్ కొంతకాలంగా నిషేధిత మద్యాన్ని లారీల్లో, ఇతరత్రా వాహనాల్లో గుట్టుచప్పుడు కాకుండ పెద్దమొత్తంలో తరలిస్తున్నాడు. అతడిపై జహీరాబాద్, చేవెళ్ల, కుత్బుల్లాపూర్, శంషాబాద్ తదితర ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. న్యాయస్థానానికి హాజరుకాకుండ తప్పించుకు తిరుగుతున్నాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అంతర్‌రాష్ట్ర స్మగ్లర్ ఆరీఫ్‌ఖాన్‌ను పట్టుకునేందుకు నిఘా పెంచాం. నమ్మదగిన సమాచారం మేరకు ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులందరూ మూకుమ్మడిగా ఈ నెల 8న గోవాకు వెళ్లి అక్కడ వాల్‌పాయ్ పోలీసుస్టేషన్ వద్ద అరెస్ట్ చేశారు. గురువారం జహీరాబాద్‌కు తీసుకువచ్చి న్యాయస్థానంలో హాజరుపరుచామని, నిందితుడు ఆరీఫ్‌ఖాన్‌కు రిమాండ్‌కు తరలించామని పోలీసులు వివరించారు.

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

గజ్వేల్ రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండలం కొల్గూరుకు చెందిన మహిళ అంబులెన్స్‌లోనే ప్రసవించింది. గ్రామానికి చెందిన రమ్య(22)కు పురిటినొప్పులు రావడంతో 108కు ఫోన్ చేశారు. ఈఎంటీ రాజు, పైలట్ సీహెచ్ మహిపాల్ గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యంలో నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ ప్రసవం చేశారు. రమ్య పండండి మగ బిడ్డకు జన్మనిచ్చిందని, తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారని తెలిపారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో సిద్దిపేట విద్యార్థినులకు పతకాలు

సిద్దిపేట కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో సిద్దిపేట క్రీడాకారులు సత్తా చాటారు. రెండు బంగారు, ఒక సిల్వర్ పతకాన్ని సాధించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ, డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-16, అండర్-19 విభాగాల్లో సిద్దిపేట ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు పి.రవళి, కె.హర్షిత బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. సైక్లింగ్ అండర్-16 విభాగంలో బి.కావ్య సిల్వర్ మెడల్ సాధించింది. ప్రతిభ చాటిన ముగ్గురు క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలో పాల్గొనున్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ డి.హిమబిందు, అధ్యాపక బృందం అభినందించారు.

ధరణితో మా భూములు పోయాయి..

● గిరిజన రైతుల ఆవేదన

పంజాగుట్ట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణితో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న తమ భూములు పోయాయని రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం కొండకల్ గ్రామ పంచాయతీలోని కొండకల్ తండా, సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం వెలిమల తండావాసులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గిరిజన సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ నాయక్, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్, లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్‌నాయక్ బాధిత గిరిజన రైతులతో కలిసి మాట్లాడారు. భూస్వాముల చేతుల్లో ఉన్న భూముల్లో అప్పట్లో సీలింగ్‌యాక్ట్‌తో ప్రభుత్వానికి స్వాధీనమయ్యాయని తెలిపారు. ఆ భూములను ప్రభుత్వం నుంచి గిరిజనులు అప్పటి కొనుగోలు చేసి, సాగు చేసుకుంటుండగా, ధరణి చట్టంతో ఆభూములు మళ్లీ వారి పేర్లతో ఆన్‌లైన్‌లో దర్శనమిస్తున్నాయని వాపోయారు. ఇదే అదనుగా ఆనాటి భూస్వాముల వారసులు తమను గెంటివేశారని ఆరోపించారు. దాదాపు 250 కుటుంబాలకు చెందిన 600 ఎకరాలు వారి అధీనంలోకి వెళ్లాయని, ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టంలో తమకు న్యాయం చేయాలని కోరారు.

క్రైం కార్నర్

అప్పుల బాధతో పౌల్ట్రీఫాం యజమాని ఆత్మహత్య

నర్సాపూర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతోపాటు తండ్రి పేరిట ఉన్న భూమి తన పేరిట పట్టా మార్పిడి కావడం లేదన్న మనస్తాపంతో పౌల్ట్రీఫాం యజమాని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నర్సాపూర్ పరిధిలో బుధవారం రాత్రి చోటుచేసుకున్నది. గురువారం ఎస్ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం.. తుజాల్‌పూర్‌కు చెందిన కొట్టుముక్కల యాదగిరి(52) తన పొలంలో పౌల్ట్రీఫాం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. దానికి చేసిన అప్పు తీర్చే మార్గం లేక మనోవేదనకు గురయ్యాడు. తండ్రి పేరిట ఉన్న పొలం తన పేరు మీద పట్టా మార్పిడికి ప్రయత్నించగా కాకపోవడంతో మనస్తాపం చెంది బుధవారం రాత్రి పౌల్ట్రీఫాంలో ఉరేసుకుని చనిపోయాడు. యాదగిరి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మృతదేహానికి రీపోస్ట్‌మార్టం

● ప్రైవేట్ ఆస్పత్రి నిర్లక్ష్యంతో చనిపోయిందని కుమార్తె ఫిర్యాదు
● నాలుగు నెలల తర్వాత కేసు



పోస్టుమార్టం చేసేందుకు వచ్చిన తహసీల్దార్, గాంధీ ఆస్పత్రి వైద్యులు

రామాయంపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఓ ప్రైవేట్ ఆసుపత్రి నిర్లక్ష్యంతోనే తన తల్లి చనిపోయిందంటూ కూతురు ఆలస్యంగా ఫిర్యాదు చేయగా, మృతదేహాన్ని పూడ్చిపెట్టిన నాలుగు మాసాల తర్వాత రీపోస్టుమార్టం నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. రామాయంపేట మండలం సుతార్‌పల్లి గ్రామానికి చెందిన రాగిచిన్నవల్లోళ్ల లక్ష్మి(48) నాలుగు నెలల క్రితం కళ్లు తిరిగి పడిపోగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అయితే, అప్పట్లో లక్ష్మి బ్రేయిన్‌డెడ్ అయిందంటూ వైద్యులు తెలిపారు. సుమారు రూ.2 లక్షల బిల్లు వసూలు చేశారు. డబ్బు చెల్లించి మృతదేహాన్ని తీసుకొచ్చి సుతార్‌పల్లిలో పూడ్చిపెట్టారు. నాలుగు నెలల తర్వార లక్ష్మి కూతురు అశ్విని హైదరాబాద్‌లోని సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన తల్లి మృతదేహానికి మళ్లీ పోస్టుమార్టం నిర్వహించాలని కోరగా, గురువారం గాంధీ ఆస్పత్రి వైద్యులు, స్థానిక తహసీల్దార్ రజని సమక్షంలో రీపోస్టుమార్టం నిర్వహించారు.

350 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యం తరలిస్తున్న కంటైనర్

మునిపల్లి, జనవరి9 (ఆంధ్రజ్యోతి) : గుజరాత్ రాష్ట్రానికి తరలిస్తున్న 350 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కంకోల్ టోల్‌ప్లాజా వద్ద మునిపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రాజేష్‌నాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి గుజరాత్ రాష్ట్రానికి కంటైనర్‌లో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు పక్కా సమాచారంతో సంగారెడ్డి జిల్లా మునిపల్లి కంకోల్ టోల్‌ప్లాజా వద్ద బుధవారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానం వచ్చిన కంటైనర్‌ను ఆపి తనిఖీ చేయగా అందులో పీడీఎస్ బియ్యం పట్టుబడ్డాయి. కంటైనర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సదాశివపేట సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ సుజాత ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్‌నాయక్ తెలిపారు.

ఆర్టీఐ సీజ్ చేసిన వాహనాల పార్కింగ్‌లో చెలరేగిన మంటలు

● నాలుగు ఆటోలు, కారు దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నర్సాపూర్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఆర్టీఐ అధికారులు వివిధ సందర్భాలలో సీజ్ చేసిన వాహనాలను నర్సాపూర్ ఆర్టీసీ డిపోలోని ఓ ఖాళీ స్థలంలో నిలిపారు. అయితే, వాహనాలు ఉన్న చోట గురువారం ఉదయం ఒక్కసారిగా పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. అది గమనించిన ఆర్టీసీ సిబ్బంది వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారమివ్వగా వారు వచ్చి మంటలు ఆర్పారు. అయితే అప్పటికే నాలుగు ఆటోలు, కారు దగ్ధమైంది. ఈ మంటలు అంటుకోవడానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

చలి@ 6.9 డిగ్రీలు

● మరింత పడిపోయిన ఉష్ణోగ్రతలు
● కోహీర్‌లో తొమ్మిది రోజులుగా అత్యల్పంగా నమోదు



కోహీర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా గజగజ వణికిపోతున్నది. రెండు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు కాస్త పెరిగగా, గురువారం మళ్లీ పడిపోయాయి. బుధవారం సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో మాత్రమే సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రత నమోదవగా, గురువారం మాత్రం ఉమ్మడి జిల్లాలో పదిహేడు చోట్ల నమోదయ్యాయి. ఎప్పటిలాగే కోహీర్‌లో అత్యల్పంగా 6.9 డిగ్రీలు నమోదైంది. మళ్లీ ఐదారు రోజుల క్రితం కనిష్ఠాన్ని తాకింది. రెండు రోజుల క్రితం 9 డిగ్రీలు, బుధవారం 8.8 డిగ్రీలుండగా గురువారం మళ్లీ పడిపోయింది. కొత్త సంవత్సరం ప్రారంభం నుంచి ఉమ్మడి జిల్లాలో చలి తీవ్రత విపరీతంగా పెరుగుతూనే ఉంది. సిద్దిపేట జిల్లా అంగడికిష్టాపూర్‌లో, మెదక్ జిల్లా దామరంచలో 9.7 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.


సంగారెడ్డి జిల్లాలో.. కోహీర్‌లో 6.9, న్యాల్‌కల్‌లో 7.4, కంగ్టిలో 8.6, అల్గోల్‌లో 8.8, ఝరాసంగంలో 9.1, మునిపల్లిలో 9.2, కంలోల్‌లో 9.2, నల్లవల్లిలో 9.2, మల్చల్మలో 9.2, అల్మాయిపేట్‌లో 9.5, నిజాంపేట్‌లో 9.6, సిర్గాపూర్‌లో 9.7 లక్ష్మీసాగర్‌లో 9.9, జహీరాబాద్‌లో 10.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మెదక్ జిల్లాలో.. దామరంచలో 9.7, మనోహరాబాద్‌లో 9.9, కొల్చారంలో 9.6, బోడగట్‌లో (ఈఎస్ఎస్) 10.0, శివ్వంపేటలో 10.3, నర్సాపూర్‌లో 10.2, శంకరంపేటలో 10.8, డి.ధర్మారంలో 10.9 డిగ్రీలు

సిద్దిపేట జిల్లాలో.. అంగడికిష్టాపూర్‌లో 9.7, పోతిరెడ్డిపేటలో 10.2, కొండపాకలో 10.3, చిట్యాల్‌లో 10.3, హబ్సీపూర్‌లో 10.5, రేబర్తిలో 10.7, చీకోడ్‌లో 10.8, దౌల్తాబాద్‌లో 10.9, వెంకట్‌రావుపేట్‌లో 10.9, నంగనూరులో 10.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

అంసాన్‌పల్లిలో రాతియుగం ఆనవాళ్లు

పనిముట్ల గుర్తింపు ● క్రీస్తు పూర్వం 5000 సంవత్సరాల గుర్తులు



ఆనవాళ్లను చూపిస్తున్న ఔత్సాహిక చరిత్ర పరిశోధకుడు బుర్ర సంతోష్

కొల్చారం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా కొల్చారం మండలం అంసాన్‌పల్లి గ్రామ శివారులోని పాత శివాలయం గుట్ట మీద నవీన రాతియుగం ఆనవాళ్లను గురువారం ఔత్సాహిక చరిత్ర పరిశోధకుడు, లైబ్రేరియన్ బుర్ర సంతోష్ గుర్తించారు. ఆనాటి ఆదిమానవులు ఆహార వేటలో భాగంగా ఉపయోగించిన రాతి పనిముట్లు, పదును చేయడానికి నూర్చిన నూరుడుగుంతలు (గ్రూవ్స్) కనుగొన్నట్లు తెలిపారు. ఈ ఆనవాళ్లను బట్టి ఈ ప్రాంతంలో క్రీస్తుపూర్వం 5000 సంవత్సరం నుంచి ఆదిమానవులు నివసించారని పేర్కొన్నారు. ఇదివరకే కాజిపల్లి ఉడుము గుట్టలు, జక్కన్నపేట నల్లగుట్ట, కుక్కునూరు బండలు, హస్తలాపూర్ గుట్టలలో పురాతన మానవుడి ఆడవాళ్ల, అప్పటి ఆదిమానవుల రాతి పెయింటింగ్‌లను గుర్తించామని తెలిపారు.



నిండు ప్రాణాలకు ముప్పు

● అతివేగం..మద్యం మత్తుతో జీవితాలు చిత్తు
● రోడ్డు భద్రతా నిబంధనలను పాటించని వాహనచోదకులు
● పోలీసులు పదేపదే చెబుతున్నా మారని తీరు

సంగారెడ్డి క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వాహనదారుల నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలు బలవుతున్నాయి. రోడ్డు భద్రతా నిబంధనలను ఉల్లంఘించి ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. మితిమీరిన వేగంతో వాహనాలను నడుపుతుండడంతో పాదాచారులు, ద్విచక్రవాహనదారులకు ముప్పు వాటిల్లుతోంది. పోలీసులు పదేపదే చెబుతున్నా మద్యం తాగి ఇష్టారీతిగా తోలుతున్నారు. పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తూ భారీగా జరిమానాలు విధిస్తున్నా తీరు మారడం లేదు. ఈ గతేడాది సంగారెడ్డి జిల్లాలో మొత్తం 852 రోడ్డు ప్రమాదాలు జరగగా 384 మృతి చెందారు. 913 మంది క్షతగాత్రులయ్యారు.

2024 వివరాలు	
రోడ్డు ప్రమాదాలు	852
మృతులు	384
క్షతగాత్రులు	913
వాహన తనిఖీలు, కేసులు	1,94,888
జరిమానాలు	రూ.7,78,47,962

రోడ్డు విస్తరణ పనులు

65వ నంబర్ హైవే ప్రధానంగా సంగారెడ్డి జిల్లా మీదుగానే ఎక్కువగా ఉంటుంది. ఇది హైదరాబాద్-ముంబై జాతీయ రహదారి కావడంతో ప్రతీరోజూ భారీ వాహనాలు వేల సంఖ్యలో తిరుగుతుంటాయి. ముఖ్యంగా షిర్డీ, ముంబైలకు ప్రైవేట్ ట్రావెల్స్ ఎక్కువగా వెళ్తుంటాయి. జిల్లాలో పరిశ్రమలు కూడా ఎక్కువగానే ఉండటంతో భారీ వాహనాలు దీని గుండా రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. నాలుగు లేన్లుగా ఉన్న ఈ రహదారిని ప్రస్తుతం ఆరు లేన్ల రోడ్డుగా విస్తరిస్తున్నారు. పనులు కొనసాగుతుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.



జహీరాబాద్ సమీపంలో చోటుచేసుకున్న ప్రమాదం (ఫైల్)

మద్యం మత్తులో డ్రైవింగ్

65వ నంబర్ జాతీయ రహదారిపై వందలాది వాహనాల రాకపోకల కారణంగా పటాన్‌చెరు నుంచి జహీరాబాద్ వరకు రోడ్డుకు ఇరువైపులా దాబాలు, రెస్టారెంట్లు అనేకం వెలిశాయి. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు వీటిని నిర్వహిస్తున్నారు. కొన్ని దాబాల్లో మద్యం సిట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. ఈదారి గుండా ఎప్పుడు వేళ్లే వాహనదారులకు మద్యం సిట్టింగ్‌లు ఎక్కడ కొనసాగుతున్నాయో అందరికీ తెలుసు. మద్యం సిట్టింగ్‌ల అనంతరం మత్తులోనే వాహనాలు నడిపి ప్రమాదాలకు గురవుతున్నారు. పాదచారులను, ద్విచక్రవాహనదారులను గుద్ది వెళుతున్నారు. హైవే పక్కన పెట్రోల్ బంకుల వద్ద భారీ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు అనధికారికంగా పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్రవాహన చోదకులు అతివేగంగా వచ్చి పార్కింగ్ చేసి ఉన్న భారీ వాహనాలను చూసుకోక వెనుకవైపు నుంచి ఢీకొడుతున్నారు. రాత్రి వేళల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. డాబాలు, రెస్టారెంట్లు, సిట్టింగ్‌లు ఉన్న ప్రాంతాల్లో భారీ వాహనాలను రహదారి పక్కనే గంటలతరబడి పార్కింగ్ చేస్తున్నారు. హైవే అథారిటీ స్పందించాల్సిన అవసరం ఉంది. అలాగే ఎక్కడికక్కడ పోలీసులు రోడ్డు పక్కన పార్కింగ్‌ను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలి.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి ఇటీవల మొబైల్ ఈ బైక్‌లను ప్రారంభించాం. అలాగే సంగారెడ్డి, పటాన్‌చెరు పట్టణాల్లో ట్రాఫిక్ సమస్య పరిష్కరించడానికి తాత్కాలిక బోలార్ట్స్, ఫ్రీ లెఫ్ట్‌లు ఏర్పాటు చేశాం. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వాహనాల అతివేగం, మద్యం సేవించి వాహనాలను నడపడం వల్లనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వాహనచోదకులకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. జాతీయ రహదారులపై ప్రయాణం చేసే టప్పుడు జాగ్రత్తగా వాహనాలు నడపాలి. జాతీయ రహదారులపై అవసరమైన చోట యూటర్న్‌లు చేయడం, అవసరం లేని చోట యూటర్న్‌లను మూసివేయడం జరిగింది.

- చెన్నూరి రూపేష్, సంగారెడ్డి ఎస్పీ

బ్లాక్‌స్పాట్లు ఇవే...

సంగారెడ్డి జిల్లాలో 65వ నంబరు జాతీయ రహదారిపై పోలీసులు కొన్ని బ్లాక్‌స్పాట్లను గుర్తించారు. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో పటాన్‌చెరు ఆర్టీసీ బస్టాండ్, ముత్తంగి, సమీపంలోని స్వీట్‌హార్ట్ హోటల్, ఇస్నాపూర్ చౌరస్తా, లక్డారం గేట్, నోవాపాన్ చౌరస్తా, రుద్రారం గ్రామాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించారు. సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కవలంపేట, కంది, జమ్‌జమ్ దాబా, పోతిరెడ్డిపల్లి చౌరస్తా, కొండాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్కాపూర్ చౌరస్తా, సదాశివపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పేట ఆర్టీసీ బస్టాండ్, నందికంది, ఎంఆర్ఎఫ్ కాలనీ, కోహీర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దిగ్వాల్, సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించారు.

ప్రమాదాల నివారణకు హైవే 44 దత్తత

● ప్రథమ చికిత్సపై పోలీసు, రవాణ శాఖకు సేవ్ లైఫ్ ఫౌండేషన్ శిక్షణ

తూప్రాన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణ కోసం జాతీయ రహదారి 44ను సేవ్ లైఫ్ ఫౌండేషన్ దత్తత తీసుకున్నది. గురువారం మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచనల మేరకు తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ గురుకులంలో తూప్రాన్ పోలీసు సబ్‌డివిజన్ పరిధి శిక్షణ నిర్వహించారు. తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి హాజరై మాట్లాడారు. సేవ్ లైఫ్ ఫౌండేషన్ సహాయం జాతీయ రహదారి 44పై ప్రమాదాల నివారణకు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. హైవే 44 మీదుగా అతివేగంగా ప్రయాణించే వాహనాలపై ఆటోమేటిక్ చలాన్ జనరేట్ అయ్యే విధంగా ఏఎన్‌పీఆర్ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. హైవేపై రోడ్డు ఇంజనీరింగ్ డిఫెక్ట్ ప్రదేశాలను గుర్తించి సరిచేసేందుకు ప్రణాళికలు రూపొందించనున్నారు. శిక్షణలో తూప్రాన్ సీఐ రంగ కృష్ణ, ఎస్ఐలు శివానందం (తూప్రాన్), సుభాష్‌గౌడ్ (మనోహరాబాద్), రవాణాశాఖ అధికారి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

పాపన్నపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకే ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కలెక్టర్ పాపన్నపేట మండలం చీకోడు జిల్లా పరిషత్ హైస్కూల్, షెడ్యూల్ కులాల బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ముందుగా విద్యార్థుల భోజనశాలలను, స్టోర్‌రూమ్‌ను పరిశీలించారు. మెను అమలు తీరును హైస్కూల్ ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదిలో కలెక్టర్ టీచర్‌గా మారి పాఠాలు బోధించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి రాబోయే తరానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ప్రభుత్వ బడుల్లో గ్రంథాలయాల ఏర్పాటు అభినందనీయం

● రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్

గజ్వేల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటు అభినందనీయమని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ అన్నారు. గురువారం గజ్వేల్‌లో టీవైఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవరెడ్డితో కలిసి హాజరయ్యారు. అలాగే గజ్వేల్ పట్టణంలోని శాఖా గ్రంథాలయాన్ని డాక్టర్ రియాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు సంప్రదాయ విద్యపై మంచి పట్టు ఉంటుందని, లైబ్రరీలతో పోటీ పరీక్షలు, ఉన్నత విద్య, వివిధ కోర్సులు, ఉద్యోగ నోటిఫికేషన్లు, నూతన సాంకేతిక పరిజ్ఞానం తదితర ప్రపంచస్థాయి అంశాల పట్ల అవగాహన కలుగుతుందని తెలిపారు. ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవరెడ్డి మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా సామాజిక సేవలు విస్తృతం చేసిన టీవైఆర్ ఫౌండేషన్ రాష్ట్ర, జాతీయస్థాయిలో గుర్తింపు దక్కించుకున్నదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్న లైబ్రరీల ద్వారా విద్యతోపాటు పోటీ పరీక్షల్లో సైతం నైపుణ్యత ప్రదర్శించి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీవై రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, టీవైఆర్ ఫౌండేషన్ సభ్యులు ప్రభావతి, విజయలక్ష్మి, రోహిత్, రాహుల్, సత్యనారాయణ, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలను చూపిస్తున్న రియాజ్, తదితరులు

యూనిఫాంలు బాగున్నాయి

మర్కుక్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థుల యూనిఫాం బాగున్నాయని రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్ టీవైఆర్ ఫౌండేషన్‌ను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలు ఇలా పనిచేస్తే ఇక కార్పొరేట్ పాఠశాలలు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో అంగడి కిష్టాపూర్ ప్రధానోపాధ్యాయులు బాలకిషన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ

నర్సాపూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణతో పాటు వ్యక్తిగత జీవితం ప్రస్తుతం ఒత్తిడితో కూడుకుని ఉంటుండటంతో ఆ ఒత్తిడికి దూరంగా ఆరోగ్యకర వాతావరణంలో జీవనం సాగేదెలా అనే అంశంపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నర్సాపూర్‌లో పలు శాఖల అధికారులు, సిబ్బందికి స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ ఇచ్చారు. గురువారం స్థానిక యాదవ సంఘం భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్టు సునీత కొర్రపాటి హాజరై ఉద్యోగులకు ఒత్తిడికి దూరంగా ఉంటూ అటు విధులు, ఇటు వ్యక్తిగత జీవనం సాగేవిధంగా ఎలా ఉండాలనే అంశాలను వివరించి శిక్షణ ఇచ్చారు.

కాసాల గ్రామపంచాయతీని సందర్శించిన డీపీవో

హత్నూర: హత్నూర మండల పరిధిలోని కాసాల గ్రామాన్ని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా గురువారం సందర్శించారు. కొనసాగుతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ నర్సరీ, పల్లె ప్రకృతివనం, వైకుంఠధామాన్ని పరిశీలించారు.

నేడు సమావేశం

జిన్నారం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బొల్లారం మున్సిపాలిటీ అత్యవసర పాలకవర్గ సమావేశాన్ని మంగళవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మంగతాయారు తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, అధికారులు హాజరుకావాలని కమిషనర్ తెలిపారు.

13న సర్వధర్మ సమ్మేళనం

నారాయణఖేడ్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : దివంగత స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎమ్మెల్యే శివ్‌రావు షెట్కార్ 29వ వర్ధంతిని పురస్కరించుకొని 13న నారాయణఖేడ్ శివారులో సర్వధర్మ సమ్మేళనాన్ని నిర్వహించనున్నారు. ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ తండ్రి శివ్‌రావు షెట్కార్ అందించిన సేవలను నేటితరం వారికి తెలియజేయడం కోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులు తెలిపారు.

పార్టీకి నష్టం కలిగించొద్దు

కోహీర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : నిన్నగాక మొన్న కాంగ్రెస్‌లోకి వచ్చి పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరిస్తూ మాట్లాడితే సహించేది లేదని కోహీర్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన సీనియర్ నాయకులు అన్నారు. కొందరు కావాలనే పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరిస్తూ మండల అధ్యక్షుడిని మార్చాలని లేనిపోని ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు

నిజాంపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ పంటను సాగుచేసి రెట్టింపు ఆదాయాన్ని పొందాలని ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ కృష్ణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేసి ఆయిల్‌పామ్ పంటలపై వివరించారు.

రెండోరోజూ కాంక్రిట్ కానో పోటీలు

నర్సాపూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్‌ఐటీలో నిర్వహిస్తున్న కాంక్రిట్ కానో పోటీలు గురువారం కూడా నిర్వహించారు. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వివిధ ఇంజనీరింగ్ కాలేజీల నుంచి 16 బృందాలు పాల్గొన్నాయి.

'గీత'లో ముగ్గుల పోటీలు

చేగుంట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : చేగుంట గీత స్కూల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించింది. ఇందులో 30 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతి కే.స్రవంతి, ద్వితీయ బహుమతి జీ.స్రవంతి, తృతీయ బహుమతి నాగరాణి గెలుపొందారు. గెలుపొందిన మహిళలకు ఎంఈవో నీరజ బహుమతులు అందజేశారు.

కొలువుదీరిన పాలకవర్గం

హత్నూర, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : హత్నూర మండల పరిధిలోని శేర్ఖాన్‌పల్లి గ్రామ శివారులో గల పల్లుమీది పోచమ్మ తల్లి ఆలయ పాలకవర్గం గురువారం కొలువుదీరింది. సంగారెడ్డి జిల్లా దేవాదాయ ధర్మదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ చైర్మన్‌గా మల్లాగౌడ్, ధర్మకర్తలుగా దశరథ్, లక్ష్మణ్ గౌడ్, శంకరయ్య, స్వరూప, స్వామి, ఎక్స్ అఫిషియో మెంబర్‌గా శ్రీకాంత్ ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఉన్నారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి ప్రజ్వల

జహీరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 15 నుంచి 21 వరకు కర్ణాటకలోని గుల్బర్గలో నిర్వహించే జాతీయ సమైక్యతా శిబిరానికి జహీరాబాద్ పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని పీ.ప్రజ్వల ఎంపికైందని ప్రిన్సిపాల్ చింతల హరికుమార్ తెలిపారు. కర్ణాటకలోని గుల్బర్గ యూనివర్సిటీలో జరిగే సదస్సుకు వివిధ రాష్ట్రాలకు చెందిన విశ్వవిద్యాలయాల విద్యార్థులు పాల్గొంటారన్నారు. ప్రముఖులు పాల్గొని జాతీయ సమైక్యత నిర్మాణంలో యువతపాత్ర, దేశ సమైక్యతను చాటి చెప్పే విధానంపై సూచనలను చేస్తారన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఆలయాలు ముస్తాబు

- సర్వాంగ సుందరంగా ఆలయాల ముస్తాబు
- వేకువజాము నుంచే వైకుంఠ ద్వార దర్శనాలు




వైకుంఠ ఏకాదశికి ముస్తాబైన చక్రియాల్, వెండికోలు, నారాయణఖేడ్ మండలం హన్మంత్‌రావుపేటలోని ఆలయాలు

పుల్‌కల్/నారాయణఖేడ్/చిన్నశంకరంపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వెకుంఠ ఏకాదశి (ముక్కోటి) వేడుకలకు పుల్కల్, చౌటకూర్ మండలాల్లో శ్రీవైష్ణవ ఆలయాలు ముస్తాబయ్యాయి. సింగూరులోని వేంకటేశ్వరస్వామి, ముదిమాణిక్యంలో వెలసిన రామాలయం, చక్రియాలలో వెలసిన పురాతన లక్ష్మీ అనంత పద్మనాభస్వామి ఆలయం, వెండికోలులో వెండికొండపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయాలను సుందరంగా అలంకరించారు. వైకుంఠ ఏకాదశి వేడుకల సందర్భంగా నారాయణఖేడ్ మండల పరిధిలోని చరిత్రాత్మకమైన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లు చేశారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో దీపారాధ, అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. షిరిడీ సాయిబాబా మందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు జాల శ్యామ్, బీజేపీ మండల అధ్యక్షుడు రాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీనివాసుడి కల్యాణం

అల్లాదుర్గం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వైకుంఠ ఏకాదశి వేడుకల సందర్భంగా అల్లాదుర్గంలోని వేంకటేశ్వరాలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా రెండోరోజైన శ్రీనివాసుడి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. పూజారి శిలాంకోట ప్రవీణ్‌శర్మ నేతృత్వంలో ఘటాభిషేకం, గణపతిపూజ నిర్వహించారు.

సంగారెడ్డి వైకుంఠపురానికి పాదయాత్ర



చౌటకూర్ నుంచి వైకుంఠపురానికి ఎడ్లబండ్లతో పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

పుల్‌కల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రమైన చౌటకూర్ నుంచి భక్తులు గురువారం పాదయాత్ర నిర్వహించారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణ శివారు ప్రాంతంలో వెలసిన మహాలక్ష్మీ గోదాసమేత విరాట్ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రం (శ్రీ వైకుంఠపురం)కు మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు సంఖ్యలో ఎడ్లబండ్ల ఊరేగింపుతో పాదయాత్రగా తరలివెళ్లారు. ముందుగా చౌటకూర్‌లోని అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద పూజలు చేశారు. సీడీసీ మాజీ చైర్మన్ భూంరెడ్డి సుభాష్‌రెడ్డి జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. అనంతరం మండలంలోని సరాఫ్‌పల్లి, సుల్తాన్‌పూర్, కోర్పోలు, ఉప్పరిగూడెం, బద్రిగూడెం, శేరిరాంరెడ్డిగూడెం, శివంపేట, చక్రియాల తదితర గ్రామాల స్టేజీల వద్ద, సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారి పొడవున పాదయాత్రకు ఘన స్వాగతం లభించింది. ఈ కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్ సుభాష్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నత్తి దశరత్, మాజీ సర్పంచ్ జనార్ధన్, నాయకులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయండి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా వేదికను నిర్లక్ష్యం వహించకుండా తగిన శ్రద్ధతో ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో సురక్షితమైన వాతావరణంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు చేయాలని పోలీసుశాఖను ఆదేశించారు. పోలీస్‌శాఖ, ఎన్‌సీసీ, స్కౌట్ అండ్ గైడ్స్, జాతీయ భావాలు, దేశభక్తి గేయాలతో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకర్షణీయంగా ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని వివిధ శాఖల అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌వో పద్మజారాణి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంస్థాగతంగా బీజేపీ బలోపేతమే లక్ష్యం

మెదక్ అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంస్థాగతంగా బీజేపీ బలోపేతమే పార్టీ లక్ష్యమని జిల్లా సంస్థగత ఎన్నికల అధికారి మీసాల చంద్రయ్య పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లాలోని పలు మండలాలకు కొత్త అధ్యక్షులతో పాటు జిల్లా కౌన్సిల్ సభ్యులను ఆయన ప్రకటించారు. నాయిని ప్రసాద్(మెదక్ టౌన్), వీణ (మెదక్ మండలం), రాజు(చిన్నశంకరంపేట), అవినాష్‌రెడ్డి(రామాయంపేట టౌన్), నవీన్‌గౌడ్(రామాయంపేట మండలం), శ్రీనివాస్(హావేళీఘణపూర్), హరీశ్(కొల్చారం), రాకేష్(కౌడిపల్లి), నాగేష్(చిలప్‌చెడ్), దాసు(వెల్దుర్తి), చంద్రయ్య(నర్సాపూర్‌టౌన్), రవి(శివ్వంపేట), జానకీరాంగౌడ్(తూప్రాన్ పట్టణ), బక్క వెంకటేశం(మనోహరాబాద్)

జిల్లా కౌన్సిల్ సభ్యులు...

శివకుమార్, ప్రభాకర్, అశోక్, శేఖర్, నవీన్, సిద్దిరాంలు, శేఖర్‌యాదవ్, మహిపాల్, శ్రీనివాస్, జనార్ధన్‌రెడ్డి, ఉమాదేవి, శ్రీధర్‌గౌడ్.

బీజేపీ మండల అధ్యక్షులు, జిల్లా కౌన్సిల్ సభ్యుల నియామకం

సంగారెడ్డి అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో బీజేపీ పలు మండలాల అధ్యక్షులు, జిల్లా కౌన్సిల్ సభ్యులను నియమించినట్లు జిల్లా సంస్థాగత ఎన్నికల అధికారి, రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి గ్రామీణ అధ్యక్షుడిగా హర్షవర్ధన్‌రెడ్డి, సదాశివపేట గ్రామీణ అధ్యక్షుడిగా ఆదిత్య, సదాశివపేట పట్టణ అధ్యక్షుడిగా రాజేశ్వరి, కొండాపూర్ మండల అధ్యక్షుడిగా శ్రీకాంత్‌రెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గంలోని భారతినగర్ 111 డివిజన్ అధ్యక్షురాలిగా రజిని, రామచంద్రాపురం 112 డివిజన్ అధ్యక్షుడిగా నర్సింగ్ గౌడ్, పటాన్‌చెరు 113 డివిజన్ అధ్యక్షుడిగా ఆనంద్ రెడ్డి, అమీన్‌పూర్-2 రాజు, తెల్లాపూర్ అధ్యక్షుడిగా రాంబాబుగౌడ్, బొల్లారం అధ్యక్షుడిగా ఆనంద్‌కృష్ణారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్ అధ్యక్షుడిగా వైద్యనాథ్, జహీరాబాద్ గ్రామీణ అధ్యక్షుడిగా దుర్గయ్య, జహీరాబాద్-1 అధ్యక్షుడిగా సంతోష్, జహీరాబాద్-2 అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, ఝరాసంగం విశ్వనాథ్, న్యాల్‌కల్ అధ్యక్షుడిగా మల్లేశ్, అందోల్ మండల అధ్యక్షుడిగా అశోక్, రాయికోడ్ అధ్యక్షుడిగా నాగరాజ్, చౌటకూర్ మండల అధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్, నారాయణఖేడ్ పట్టణ అధ్యక్షుడిగా రాజశేఖర్ గౌడ్, అదేవిధంగా జిల్లా కౌన్సిల్ సభ్యులుగా పాపయ్య, సుధాకర్, శ్రీనివాస్, రాజేందర్‌రెడ్డి, నందారెడ్డి, బలరాం, నరేశ్‌కుమార్, అంజిరెడ్డి, ప్రవీణ్, రవీందర్‌రెడ్డి, జనార్ధన్, విశ్వనాథ్‌యాదవ్, విశ్వనాథ్ స్వామి, బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌పాటిల్, ఓంకార్‌యాదవ్, మహిపాల్‌రెడ్డి, మల్లేశం, సురేశ్‌గౌడ్, విజయ్‌షెట్కార్ నియమితులయ్యారు.

టీచర్లు పాఠాలు ఎలా చెబుతున్నారు..?

- సంగారెడ్డిలో పలు పాఠశాలల్లో డీఈవో తనిఖీలు

సంగారెడ్డి అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని పలు ప్రభుత్వ పాఠశాలలను డీఈవో వెంకటేశ్వర్లు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోతిరెడ్డిపల్లిలోని జడ్పీహెచ్‌ఎస్‌తో పాటు ప్రాథమిక పాఠశాలను సందర్శించి, బోధనపై ఆరా తీశారు. తరగతి గదులు, విద్యార్థుల అసౌకర్యాలను తెలుసుకున్నారు. విద్యార్థుల బోధన ప్రతిభను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో విద్యాసాగర్, హెచ్‌ఎం సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై ఉక్కుపాదం

- అర్ధరాత్రి మెరుపు దాడి
- ఎక్స్‌కవేటర్లతో ఆక్రమణల తొలగింపు



శేర్ఖాన్‌పల్లిలో అక్రమంగా వేసిన రేకులషెడ్లను నేలకూల్చిన అటవీశాఖ అధికారులు

హత్నూర, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండల పరిధిలోని శేర్ఖాన్‌పల్లి గ్రామ శివారులో గల అటవీ భూముల్లో ఆక్రమణలపై అటవీశాఖ అధికారులు ఉక్కుపాదం మోపారు. అటవీ భూముల ఆక్రమణలపై 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వచ్చిన వరుస కథనాలకు ఎట్టకేలకు స్పందించారు. సంగారెడ్డి డివిజన్ ఎఫ్‌ఆర్‌వో దేవీలాల్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శాహిని తన సిబ్బందితో బుధవారం రాత్రి మెరుపు దాడిచేసి 33 రేకుల షెడ్లను ఎక్స్‌కవేటర్ల సహాయంతో తొలగించారు. మిగిలిన దుకాణాలను వీలైనంత త్వరగా తొలగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి, గుమ్మడిదల సెక్షన్ అధికారులు వేణుగోపాల్, హుస్సేన్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో గీతా విద్యార్థుల ప్రతిభ



జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి చేతులమీదుగా బహుమతులు అందుకుంటున్న గీతా విద్యార్థినులు

మెదక్ అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో మెదక్ గీతా స్కూల్ విద్యార్థులు ప్రాజెక్టుల రూపకల్పనతో సత్తాచాటారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరిగిన రాష్ట్రస్థాయి ప్రదర్శనలో గీతా విద్యార్థినులు అంజనశ్రీ, మనూష రూపొందించిన అడల్ట్రేషన్ ప్రాజెక్టు, యమ్మ, హరిణి రూపొందించిన బయోప్లాస్టిక్ డివైజ్ ప్రాజెక్టు దక్షిణ భారతస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైంది. విద్యార్థులకు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి బహుమతులు అందజేశారు.

సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ

చిన్నశంకరంపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదిగేందుకు ఉపాధి కల్పించుకోవాలని మన కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రవికుమార్ అన్నారు. ఎన్నార్‌ఈజీఎస్ ఆధ్వర్యంలో గురువారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని సమాఖ్య భవనంలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు సేంద్రియ వ్యవసాయం, వర్మీ కంపోస్టు, సబ్బులు, కూరగాయల పెంపకంపై శిక్షణ నిర్వహించారు.

చదువుకు అండగా..

- ప్రభుత్వ పాఠశాలలకు, విద్యార్థులకు చేయూతనందిస్తున్న సీజీఆర్ ట్రస్టు
- సొంత నిధులతో అభివృద్ధి పనులు



ట్రస్టు ఆధ్వర్యంలో గుమ్మడిదల ప్రాథమిక పాఠశాల చుట్టూ ఏర్పాటు చేసిన సోలార్ ఫెన్సింగ్



తాగునీటి కోసం వేసిన బోర్ వాటర్ ప్రారంభిస్తున్న ట్రస్టు సభ్యులు

గుమ్మడిదల జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : సమాజసేవే లక్ష్యంగా సొంత నిధులతో పేదలను ఆదుకుంటూ.. పేద విద్యార్థులకు, పాఠశాలల సౌకర్యాల కోసం సీజీఆర్ ట్రస్టు అందిస్తున్న సేవలు ప్రశంసలు అందుకుంటున్నాయి. గుమ్మడిదల గ్రామంలో కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ ట్రస్టు ద్వారా అనేక గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బ్యాగులు, మధ్యాహ్న భోజనానికి ప్లేట్లు అందించారు. గుమ్మడిదల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కోసం సీజీఆర్ ట్రస్టు భారీగా నిధులు ఖర్చు చేస్తోంది. లక్షలు వెచ్చించి పాఠశాల చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో కోతుల బెడద పూర్తిగా తొలగిపోయింది. అలాగే విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించేందుకు ప్రత్యేకమైన క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. ట్రాక్, ఫీల్డ్ విభాగాల్లో మెరుగైన అవకాశాల కోసం గ్రౌండ్‌ను సుందరంగా అభివృద్ధి చేసి, ఐమాక్స్ లైట్లు అమర్చడంతో విద్యార్థులు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. పాఠశాల ఆవరణలో యువతకు ఆదర్శంగా వివేకానందుడి విగ్రహాన్ని సైతం ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

సమాజ సేవ సీజీఆర్ ట్రస్టు లక్ష్యం



గుమ్మడిదల గ్రామ ప్రజలకు సీజీఆర్ ట్రస్టు చేసిన సేవలు ఎప్పటికీ మరిచిపోరు. తన సొంత నిధులతో పాఠశాలలకు తోడ్పాటునందించడమే కాకుండా, పేదలను ఆదుకోవడం వంటి చర్యలతో ట్రస్టు గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నాయి. పిల్లల భవిష్యత్‌ను గమనించి అడుగులు వేస్తున్న ట్రస్టు ప్రతీ చిన్న మార్పును గొప్ప విజయంగా మార్చడంలో ముందుంటుంది. మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ప్రజల ఆకాంక్ష.

- చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, సీజీఆర్ ట్రస్టు చైర్మన్

'ఇందిరమ్మ' సర్వే.. తప్పుల తడక

3వ పేజీ తరువాయి

గతనెల 9 నుంచి చేపట్టారు. ఇంటి నిర్మాణం చేసుకునే పేదలకు రూ.5 లక్షలు అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. మొదటి దశలో ఇంటి స్థలం ఉన్నవారికి ప్రాధాన్యత నిచ్చారు. రెండో దశలో ఇల్లు లేని అర్హులైన నిరుపేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రభుత్వం ఈ పథకం అమలును ప్రారంభించిన నేపథ్యంలో లబ్ధిదారుల ఎంపికకు గ్రామాలు, మున్సిపల్ పట్టణాలలో సర్వే ప్రారంభించారు. దరఖాస్తు దారుల ఇళ్ల వద్దకు వెళ్లిన సర్వేయర్లు యాప్ ద్వారా వివరాలు సేకరిస్తున్నారు. సర్వేయర్లు నమోదు చేసిన యాప్‌లో వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో మరోసారి ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. వీరు దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు తెలుసుకుంటారు. ఎక్కడైనా తప్పుడు వివరాలు నమోదు చేసినట్లు వెల్లడైతే సర్వేయర్లపై చర్యలు చేపట్టే అవకాశం ఉంది. అర్జీదారుల ఇళ్ల వద్ద సర్వే సిబ్బంది ఫొటోలు తీసి ఆ తర్వాత ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఇళ్ల వివరాలు పూర్తి స్థాయిలో ఉండడానికి రేకులు, స్లాబు, మట్టి గోడలు, ఇటుక గోడలు, పెంకుటిల్లు ఇలా వివరాల వారీగా ఫొటోలు తీయడానికి సర్వే సిబ్బంది ఒక్కో ఇంటికి సుమారు 30 నిమిషాలు వెచ్చించాల్సి వస్తోందని తెలిపారు.

మెదక్ జిల్లాలో 1,91,100 దరఖాస్తులు

మెదక్ జిల్లావ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 1,91,100 దరఖాస్తులు వచ్చాయి. సర్వే సిబ్బంది ఇప్పటివరకు 1,82,971 దరఖాస్తులను పరిశీలించి, వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చినట్లు హౌసింగ్‌శాఖ అధికారి యాదయ్య పేర్కొన్నారు. ఇప్పటివరకు 96.53 శాతం సర్వే పూర్తయినట్లు వివరించారు. మిగిలిన దరఖాస్తులు ఇంతర ప్రాంతాలకు వలస వెళ్లిన కుటుంబాలవని, వారి వివరాలు సేకరించాల్సి ఉందని తెలిపారు.

సంగారెడ్డి జిల్లాలో 97 శాతం..

సంగారెడ్డి టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే సంగారెడ్డి జిల్లాలో దాదాపుగా పూర్తయింది. ఇప్పటివరకు 97 శాతం సర్వే పూర్తిచేసి రాష్ట్రంలో 6వ స్థానంలో నిలిచింది. 98 శాతం సర్వే పూర్తిచేసిన కామారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలు మొదటి మూడుస్థానాల్లో నిలిచాయి. ములుగు, కరీంనగర్ జిల్లాలతో కలిపి సంగారెడ్డి జిల్లా 6వ స్థానంలో నిలిచింది. మిగిలిన 3 శాతం దరఖాస్తులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారివని గుర్తించారు. వారిని పిలిపించి వివరాలు సేకరించేందుకు ప్రభుత్వం వారంరోజులు గడువు పొడిగించినట్టు హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ చలపతిరావు పేర్కొన్నారు.

జిల్లాలో 3,18,775 మంది ఇందిరమ్మ గృహాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు 3,09,045 లబ్ధిదారుల వివరాలను సేకరించారు. జిల్లావ్యాప్తంగా 25 మండలాల్లోని 646 గ్రామ పంచాయతీల్లో 62,150 దరఖాస్తులు రాగా.. 60,488 దరఖాస్తుల వివరాలను సేకరించారు. 8 మున్సిపాలిటీల్లో 2,56,625 దరఖాస్తులు వచ్చాయి. గురువారం నాటికి 2,48,130 దరఖాస్తుల వివరాల సేకరణ పూర్తయినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

ఓవైపు తక్కువ.. మరోవైపు ఎక్కువ!

3వ పేజీ తరువాయి

తాము తీవ్రంగా నష్టపోతామని వాపోతున్నారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

రికార్డుల ప్రకారమే..

65వ నంబరు జాతీయ రహదారి విస్తరణలో ఎటువంటి లోపాలు లేవు. ఇప్పటికే ఉన్న రికార్డుల ప్రకారమే రోడ్డును విస్తరిస్తున్నాం. రోడ్డు విస్తరణపై ఎటువంటి ఫిర్యాదులు కానీ, అభ్యంతరాలు కానీ అందలేదు.

- ధర్మారెడ్డి, నేషనల్ హైవేస్ అథారిటీ ఈఈ

పరి'శ్రమ' వృథా..!

3వ పేజీ తరువాయి

ప్రతినిధులను ప్రశ్నించారు. తమని ప్రొటెక్షన్ అడిగిన అధికారులు తాము రాకుండానే ప్రహరీ కూల్చి వేయడం ఏమిటని స్థానిక పోలీసులు ప్రశ్నించి, పోలీస్‌స్టేషన్‌కు రావాలని సూచించగా, లంచ్ తర్వాత వస్తామని చెప్పి రాలేదు.

సబ్ డివిజన్ చేసుకోవాలని చెప్పాం

శ్రీ నిధి సంస్థకు చెందిన భూమి విషయంలో సబ్ డివిజన్ చేసుకోవాలని సూచించామని టీజీఐఐసీ జోనల్ మేనేజర్ రతన్ రాథోడ్ తెలిపారు. 2006లోనే ఈ భూమికి సబ్ డివిజన్ అయింది కదా అని ప్రశ్నిస్తే.. మళ్లీ సబ్ డివిజన్ చేసుకోవాలని చెప్పడం గమనార్హం.

- టీజీఐఐసీ జోనల్ మేనేజర్ రతన్ రాథోడ్

'పద్యకృతులు తెలుగుభాషకు తల్లివంటివి'

పటాన్‌చెరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఛందోబద్ధమైన తెలుగుపద్యాలు తెలుగువాడికి మాత్రమే సొంతమైన గుత్తసొత్తని, అపురూపమైన పద్యకావ్యాలు మరిన్ని రావాలని ప్రముఖ రచయిత, తారా డిగ్రీకళాశాల తెలుగు శాఖాధ్యక్షుడు డాక్టర్. మఠం మహంతయ్య అన్నారు. విశ్రాంత తెలుగుపండితులు, సాహితీలోకానికి సుపరిచితులైన విశ్రాంత తెలుగు పండితులు తల్లోజు యాదవాచార్యులు రచించిన కందాల్లో పోతన్న పద్యకృతిని గురువారం పటాన్‌చెరు పట్టణంలోని శాంతినికేతన్ పాఠశాలలో ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కవి, తెలుగు ప్రొఫెసర్ జీ.శ్రీనివాస్‌రావు, శాంతినికేతన్ పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశం, చైతన్య పాఠశాల కరస్పాండెంట్ నర్సింలు పాల్గొన్నారు.

'చట్టాలపై పిల్లలు అవగాహన పెంచుకోవాలి'

సంగారెడ్డి రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : చట్టాలపై పిల్లలు అవగాహన పెంచుకోవాలని న్యాయాధికారి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్ సూచించారు. సంగారెడ్డిలోని మహాత్మాగాంధీ బాలుర పాఠశాలలో బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి మాట్లాడారు. అనంతరం పాఠశాల వంటగది, పరిసరాలను పరిశీలించారు.

జీటీఏ క్యాలెండర్, డైరీ ఆవిష్కరించిన డీఈవో



జీటీఏ క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం(జీటీఏ) నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీని డీఈవో వెంకటేశ్వర్లు చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.

ట్రెస్మా రాష్ట్ర కార్యవర్గంలో పలువురికి చోటు

సంగారెడ్డి రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణా రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రెస్మా) రాష్ట్ర కార్యవర్గంలో సంగారెడ్డి జిల్లాకు చెందిన పలువురు కరస్పాండెంట్లకు చోటు దక్కింది. రాష్ట్ర ప్రధాన సలహాదారుడిగా పూసల లింగాగౌడ్, ఉపాధ్యక్షుడిగా ప్రశాంత్‌కుమార్, జాయింట్ సెక్రెటరీలుగా ప్రమోద్‌కుమార్, సంజీవరావ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా ప్రభు, మహిపాల్‌రెడ్డి, కార్యవర్గసభ్యులుగా వనజారెడ్డి, జగన్మోహన్‌లకు చోటు లభించింది.

డబ్బాలను తొలగించాలని ధర్నా

పెద్దశంకరంపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : తిరుమలాపూర్ గ్రామంలోకి వెళ్లే సీసీరోడ్డుపై, మురుగు కాలువలపై పలువురు అక్రమంగా వేసిన డబ్బాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ గురువారం తిరుమలాపూర్ గ్రామస్థులు పెద్దశంకరంపేట-మెదక్ రహదారిపై ధర్నా చేశారు.